సాక్షి
అనకాపల్లి
బుధవారం, 20, సెప్టెంబర్, 2023

• వైభవంగా వెంకన్న ధ్వజారోహణం

ఉపమాకలో కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు


రాజాధిరాజ వాహనంలో స్వామివారి తిరువీధి సేవ


ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగురవేస్తున్న అర్చక స్వాములు

బ్రహ్మాండనాయకుని వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ధ్వజారోహణం, రాజాధిరాజ వాహనంలో తిరువీధి సేవ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం ధ్వజారోహణం, అష్ట దిక్పాలకులకు ఆవాహన కార్యక్రమాలు నేత్రపర్వంగా జరిగాయి. కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు జరిపి, కొండ దిగువన ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, ఆండాళ్లమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవీ సమేత వేంకటేశ్వరుడికి మాడవీధుల్లో తిరువీధిసేవ జరిపారు. బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని సూచిస్తూ ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు ధ్వజపటాన్ని ఎగురవేశారు. స్వామివారికి రాజభోగ నివేదన, తీర్థగోష్టి జరిపారు. మంగళవారం రాజాధిరాజ వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో అర్చకులు పీసపాటి శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, రాజగోపాలాచార్యులు, బీహెచ్ఎస్ గోపాలాచార్యులు పాల్గొన్నారు.

-నక్కపల్లి

• మదిమదిలో వినాయకుడు

బొమ్మను చేసి.. చక్కగా అలంకరించి.. దీపం వెలిగించి.. పూలు, పత్రితో పూజించి.. బొజ్జ గణపయ్యకు కడుపారా ప్రసాదాలు పెట్టి భక్త జనం మురిసిపోయారు. స్వామి తేజస్సును తిలకించి పులకించిపోయారు. వినాయక చవితి పర్వదినం జిల్లా అంతటా ఘనంగా జరిగింది. చోడవరంలోని స్వయంభూ వినాయకునితోపాటు నక్కపల్లి మండలంలోని ఒడ్డిమిట్ట లక్ష్మీ గణపతి, పాయకరావుపేట మండలం నామవరంలోని నాడీ గణపతి తదితర దేవాలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. వీధివీధినా గణేశుని మండపాలు పెట్టి నవరాత్రులు నిర్వహిస్తున్నారు.


సింధూరం అలంకరణలో
చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి


ఘనపతి: రావికమతం మండలం కొత్తకోట శివాలయం వీధిలో సిద్ధి వినాయక యూత్ ఏర్పాటు చేసిన 30 అడుగుల భారీ వినాయక విగ్రహం

చోడవరం: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య ఆదిదేవుడైన చోడవరం శ్రీస్వయంభూ విఘ్నేశ్వర స్వామికి చవితి పూజలు కన్నుల పండువగా జరిగాయి. వేలాదిమంది భక్తుల తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది ఒకపక్క పూజలు, మరోపక్క సాంస్కృతిక కార్యక్రమాలు, కనులు మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగుల మధ్య స్వామివారి నవరాత్రి ఉత్సవాలు సోమవారం తెల్లవారుజామున ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శ్రీకారం చుట్టారు. స్వామివారికి పాలు, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. ఆలయ హోమశాలలో లక్ష్మీగణపతి హోమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితులు జరిపారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన క్యూలైన్లలో స్వామివారి దర్శనానికి పంపారు. భక్తులకు మంచినీటి ప్యాకెట్లు, ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధోత్సవం ఘనంగా జరిపారు. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, కమిటీ చైర్మన్ ఉప్పల సతీష్‌తోపాటు పలువురు ప్రముఖులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మూషిక వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తిని ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మెయిన్‌రోడ్డుపై ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ఆలయ ప్రాంగణం కనువిందు చేసింది. భారీగా బాణాసంచా కాల్చారు. చిన్నారులు వేసిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, శ్రీ వేంకటేశ్వరస్వామి భజన మండలి మహిళా బృందం వేసిన కోలాటం అందర్నీ ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారు సింధూరం అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు.

న్యూస్‌రీల్

నిమజ్జనోత్సవాలకు పోలీసు బందోబస్తు


తుమ్మపాల ఏలేరు కాలువ పరిశీలనలో పట్టణ సీఐతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నవరాత్రి మహోత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని శారదానది ఘాట్, మండలంలో తుమ్మపాల ఏలేరు కాలువ, జీవీఎంసీ విలీన గ్రామాలైన కొత్తూరు ఏలేరు కాలువలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనోత్సవాలను జరిగే ఈ ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జీవీఎంసీ, అగ్నిమాపక దళ సిబ్బంది పర్యవేక్షణలో వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనంలో నీటిలోకి దిగే యువతపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్చరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను, ఎస్ఐలు సత్యానారాయణ, సీహెచ్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రావికమతంలో 'జగనన్నకు చెబుదాం'

తుమ్మపాల: ఈ నెల 20వ తేదీ బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని రావికమతం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గాను ఆయా మండలాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హార్బర్ రోడ్డుకు స్థల పరిశీలన

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సంబంధించి వడివడిగా అడుగులు పడుతున్నాయి. పూడిమడక మొగ వద్ద నిర్మించే హార్బర్‌ను చేరుకునేందుకు అవసరమైన రహదారి కోసం జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణలు మంగళవారం పూడిమడకలో పర్యటించారు. రహదారి నిర్మాణానికి కావాల్సిన స్థలంపై ఆరా తీశారు. వీరి వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, చేపల వెంకట రమణ తదితరులు ఉన్నారు.

మహాలయ అమావాస్యకు ప్రత్యేక రైలు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భారతీయ రైల్వే ప్రత్యేకంగా ఉలా రైలును నడుపుతున్నట్లు భారత్ గౌరవ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రయాగ్ రాజ్, వారణాసి,

24 వరకు రత్నాచల్ రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు కార్యాచరణ పనుల వల్ల ఈ నెల 24వ తేదీ వరకు విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ(12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు మార్పును గమనించి సహకరించాలని కోరారు.

గ్రామాల్లో వైద్య సేవలు భేష్

మునగపాక: ఫ్యామిలీ డాక్టర్ విధానం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని విశాఖ జనాభా పరిశోధన కేంద్రం సభ్యులు డాక్టర్ ఎడ్ల రమణ, శ్రీనివాస్‌లు తెలిపారు. మునగపాక పీహెచ్‌సీలో మంగళవారం పరిశోధన బృంద సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కొనియాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వెళ్లి మంచానపడ్డ రోగులకు సేవలందించడం చాలా బాగుందన్నారు. విలేజీ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలు అందుతున్నాయన్నారు.


104 వాహనం వద్ద విశాఖ జనాభా పరిశోధన కేంద్రం సభ్యులు

కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ లూసీ కార్డిలియా, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మురళీధర్, డీటీసీవో డాక్టర్ కిషోర్‌కుమార్, డీపీవో జగదీష్, జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు విమలగిరి, దుర్గా ప్రవళిక, సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

పుడమికి జీవం.. పైరుకు ప్రాణం

- జీవన ఎరువులను ప్రోత్సహిస్తున్న ఆర్ఏఆర్ఎస్
- ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తలు
- ఆర్బీకే ద్వారా రైతులకు పంపిణీ చేసేలా కార్యాచరణ
- ఇతర రాష్ట్రాలకు అమెజాన్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సేల్
- గతేడాది రూ.25 లక్షల విలువైన జీవన ఎరువుల సరఫరా


ద్రవరూప జీవన ఎరువుల డబ్బాలు


ఘన జీవన ఎరువుల ప్యాకెట్లు


ఆర్ఏఆర్ఎస్‌లో జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం

సాక్షి, అనకాపల్లి: జీవన ఎరువులు.. ఆ పేరు వింటేనే ప్రాణం లేచివచ్చినట్టు ఉంటుంది. రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తూ.. రైతుకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి లభించే విధంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) జీవన ఎరువుల వినియోగాన్ని విరివిగా ప్రోత్సహిస్తోంది. జీవన ఎరువుల తయారీ కేంద్రాలను నిర్వహిస్తూ జీవన ఎరువుల వినియోగం, వాటి వలన కలిగే ఉపయోగాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జీవన ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ఎలా సాధ్యమవుతుందో వివరిస్తున్నారు. ప్రతీ రైతుకి జీవన ఎరువులను అందుబాటులోనికి తీసుకురావాలనే దృఢ సంకల్పంతో ఆర్ఏఆర్ఎస్ చర్యలు చేపడుతోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేపట్టినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయని కూడా వ్యవసాయ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇటీవల జిల్లా స్థాయి వ్యవసాయ అభివృద్ధి మండలి సమీక్ష సమావేశంలో అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో జీవన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు.

అమెజాన్ యాప్ ద్వారా ఇతర రాష్ట్రాలకు..

జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం ద్వారా ఏటా 40 వేల కేజీల ఘన జీవన ఎరువులు, 80 వేల లీటర్ల ద్రవ ఎరువులు తయారు చేసే సామర్థ్యం ఆర్ఏఆర్ఎస్‌కు ఉంది. గతేడాది రూ.25 లక్షల విలువైన జీవన ఎరువులు సరఫరా చేశారు. ఇందులో ఎక్కువగా ద్రవ ఎరువులు ఉన్నాయి. ఘన జీవన ఎరువు కేజీ రూ.80, ద్రవ జీవన ఎరువు లీటర్ రూ.300 చొప్పున ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు అందజేస్తున్నారు. ఎకరాకు 2 కేజీలు ఘన ఎరువులు వేయాలి. అదే ద్రవ ఎరువులు అయితే ఎకరాకు అర లీటర్ వేయాలి. ఈ జీవన ఎరువులను అమెజాన్ ఆన్‌లైన్ యాప్ ద్వారా రైతులకు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేస్తున్నారు.

మొక్కలకు పోషక పదార్థాలు..

జీవన ఎరువులు వాడడం వల్ల ఒకవైపు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మరోవైపు రసాయనిక ఎరువుల వాడకాన్ని 25 శాతం వరకు తగ్గించుకోవచ్చు. దీనిలో ప్రధానంగా నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్‌లు లభ్యమవుతాయి. జీవన ఎరువు మొక్కలకు పోషక పదార్థాలను, మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చుతుంది. వాతావరణంలో చాలా మొత్తంలో (సుమారు 78 శాతం) నత్రజని ఉంటుంది. వాటిని మొక్కలు గ్రహించలేని పరిస్థితిలో ఉంటాయి. జీవన ఎరువుల ద్వారా మొక్కకు తగిన నత్రజనిని అందించడం, అదేవిధంగా నేలలో మొక్క తీసుకోలేని భాస్వరం, పొటాషియం ఎరువులను కూడా అందజేయడం జరుగుతోంది. నత్రజని స్థిరీకరించే జీవన ఎరువులు (నైట్రోజన్ ఫిక్సింగ్ బాక్టీరియా), భాస్వరం అందించే జీవన ఎరువులు (ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా), పొటాషియం అందించే జీవన ఎరువులు (పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా), జింక్ అందించే జీవన ఎరువులు (జింక్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా) అన్నీ లభ్యమవుతాయి.

జీవన ఎరువుల వల్ల ఉపయోగాలు

- పంట దిగుబడులు 10–15 శాతం వరకు పెరుగుతాయి
- వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు
- నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి భూసారం పెరుగుతుంది
- సూక్ష్మధాతు పోషక లోపాలను నివారిస్తాయి
- హార్మోన్లు, విటమిన్లు మొక్కలకు లభించడంతో ఆరోగ్యం మెరుగవుతుంది
- నేల గుల్లబారి వేర్లు బాగా లోపలికి చొచ్చుకుపోయి పోషకాలు ఎక్కువ గ్రహించడానికి వీలవుతుంది
- నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంతమేరకు అరికట్టవచ్చు
- ఈ జీవన ఎరువులు అన్ని పంటలకు వాడుకోవచ్చు

వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వీటిని రసాయన ఎరువులలో కలిపి వాడకూడదు. ఎండ తగలని చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.
- నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి
- జీవన ఎరువులను ప్యాకెట్‌పై ఉన్న గడువులోపే వాడాలి
- రసాయనాలతో విత్తనశుద్ధి చేసుకునేటప్పుడు విధిగా 24–28 గంటల వ్యవధి ఉండాలి
- నాణ్యత గల కల్చర్‌ను మాత్రమే వాడాలి

రైతుకు లాభసాటిగా..



నాణ్యమైన విత్తనంతో పాటు సిఫార్సు చేసిన రసాయనిక ఎరువులను సేంద్రియ ఎరువులతోపాటు వాడుకున్నట్లయితే మొక్కకు అన్ని పోషకాలు అంది చీడ పీడలను తట్టుకునే శక్తి వస్తుంది. అధిక దిగుబడులు రావడానికి అవకాశాలున్నాయి. రైతులు వీటిని ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పిస్తున్నాం. ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తాం. జిల్లా యంత్రాంగం సహాయం తీసుకుంటాం. రైతుకు పెట్టుబడి భారం ఉండకూడదనే ఆర్ఏఆర్ఎస్ జీవన ఎరువుల తయారీపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది.

-పి.వి.కె.జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త

ఎంపీహెచ్ఈవో కౌన్సెలింగ్‌లో గందరగోళం

- ఇటీవల పోస్టులను తిరస్కరించిన ఎంపీహెచ్ఈవోలకు కౌన్సెలింగ్
- మంజూరు పోస్టులు లేకపోయినా ముగ్గురికి అందలం
- బదిలీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు
- నిబంధనలు పాటించలేదని వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీకి షోకాజ్ నోటీస్


వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎదుట ధర్నా చేస్తున్న ఎంపీహెచ్ఈవోలు

మహారాణిపేట: మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్ఈవో) బదిలీల్లో గందరగోళం జరిగింది. మంగళవారం నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో అనర్హులను అందలం ఎక్కించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్యులతో పాటు మొత్తం 14 మంది సిబ్బంది కోసం రీఫిక్సింగ్(సర్దుబాటు) కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం గత కొద్ది రోజుల నుంచి చేపడుతోంది. వివిధ పోస్టులకు సంబంధించి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. మంగళవారం జరిగిన కౌన్సెలింగ్‌లో మొత్తం 18 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులు, ఉన్నతాధికారులు నిబంధనలు పాటించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బదిలీల్లో తమ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. కొంత మంది ఎంపీహెచ్ఈవోలు సైతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులను కలిసి తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశారు. అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కౌన్సెలింగ్ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరికి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రామారెడ్డి షోకాజ్ నోటీసు జారీచేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

నిబంధనలకు పాతర?

జీవో 143 ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బందిని నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని కోసం గత నెల 26వ తేదీన ఎంపీహెచ్ఈవోలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 6 జిల్లాల నుంచి 74 మందిని ఆహ్వానించారు. వీరిలో 18 మంది కౌన్సెలింగ్‌లో వచ్చిన పోస్టును తిరస్కరించారు. వీరి కోసం మంగళవారం తిరిగి వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. అయితే ఈ కౌన్సెలింగ్‌లో అధికారులు నిబంధనలు పక్కన పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ కౌన్సెలింగ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనర్హులకు ముగ్గురికి పోస్టింగులు ఇచ్చినట్లు సమాచారం. ఇందులో ఒకరు టీఎన్‌టీయూసీకి చెందిన నాయకుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరికి విశాఖలోను, ఒకరికి అనకాపల్లిలో పోస్టింగ్ కల్పించారు. నిబంధనల ప్రకారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించామని వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ ఉమాసుందరి తెలిపారు. దీనిలో పలు అసోసియేషన్లు వినతులు అందజేయగా, వాటిని తిరస్కరించామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉండాలన్న నిబంధన ప్రకారం బదిలీ చేశామని చెబుతున్నారు.

22న జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశంలో 20 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా గాజువాక జోన్ 77వ వార్డులో పెదపాలెం నుంచి చినపాలెం వరకు రూ.49.60 లక్షలతో బీటీ రోడ్డు మరమ్మతులు, విస్తరణ, అలాగే రూ.49.90 లక్షలతో చినపాలెం నుంచి పిట్టవానిపాలెం వరకు బీటీ రోడ్డు మరమ్మతులు, విస్తరణ, 65వ వార్డులో రూ.49.95 లక్షలతో భానోజీ కాలనీలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.49.84 లక్షలతో అశోక్‌రావునగర్ నంబర్-1 వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం, రూ.37.65 లక్షలతో వికాస్‌నగర్ నివాసితుల సంక్షేమ సంఘం బిల్డింగ్ పునరుద్ధరణ, రూ.35 లక్షలతో 87వ వార్డు వడ్లపూడి రాజులపాలెం పార్కులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.49.95 లక్షలతో 69వ వార్డు నాతయ్యపాలెం కల్యాణమండపం మొదటి అంతస్తు నిర్మాణం, రూ.49.78 లక్షలతో నాతయ్యపాలెం బంగారమ్మ గుడి నుంచి కిమ్స్ ఐకాన్ హాస్పటల్ వరకు హాట్‌మిక్స్ ప్రక్రియ ద్వారా బీటీ రోడ్డు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.



జోన్-4 పరిధి 28 నుంచి 39వ వార్డుల వరకు, జోన్-5 పరిధి 40 నుంచి 63వ వార్డుల వరకు పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని కొనసాగించేందుకు, మలేరియా, డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సేవలకు 30 మంది స్ప్రేయింగ్ వర్కర్స్‌ను రోజుకూలీ కింద సెప్టెంబర్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగించేందుకు, జోన్-4 పరిధి జగదాంబ వాణిజ్య సముదాయంలో గల 1, 2 దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖకు రెండేళ్ల కాలానికి ఇవ్వడం తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

క్లుప్తంగా

కల్లుగీత కార్మికుడి నేత్రదానం


పి. మారయ్య(ఫైల్)

రాంబిల్లి: భర్త చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన పుట్టెడు దుఖంలో వున్న భార్య మానవత్వం చాటుకుంది. తన భర్త కళ్లను దానం చేసి, మరో ఇద్దరికి చూపు నిచ్చేందుకు తోడ్పడింది. ఈ నెల 5న గోవిందపాలెం గ్రామానికి చెందిన పి.మారయ్య ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా, ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 17న మారయ్య మృతి చెందారు. దీంతో భార్య మల్లేశ్వరి తన భర్త కళ్లను దానం చేశారు. మారయ్య మృతదేహానికి గోవిందపాలెంలో సోమవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. మల్లేశ్వరిని రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు ఫోన్‌లో పరామర్శించారు. నేత్ర దానం చేసినందుకు ప్రశంసించారు. మారయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. యాత సంక్షేమ సంఘం నాయకులు పి.మారేష్, పి.శ్రీనివాసరావు, ఆర్.నాగులు తదితరులు మారయ్య కుటుంబానికి ప్రభుత్వం బీమా, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

కౌండిన్య ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, శ్రీశయన, యాత విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి విత్తనాల పోతురాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 2వ తేదీ వరకూ దరఖాస్తుల్ని స్వీకరిస్తామన్నారు. సంఘంలో బలహీన వర్గాల విద్యార్థులకు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కులధ్రువీకరణ ప్రతం, మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, కుల సంఘం పెద్దలచే సిఫార్సు లేఖ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను జతచేయాల్సిందిగా సూచించారు. విద్యార్థులు https:// kaundinyaeduca- tional trust. org/ వెబ్‌సైట్, లేదా trust kaundinya @gmail. com మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9959631669 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

మీ గుండెకు భరోసా



విజయవంతంగా ప్రాజెక్టు

- గుండె భద్రతకు సర్కారు సాయం
- విశాఖలో ప్రయోగాత్మకంగా అమలు

మహారాణిపేట: గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటిగంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమి) ప్రాజెక్టుకు వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన తొలి గంటలోపే అంటే గోల్డెన్ అవర్‌లోపే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలు నిలబెట్టేందుకు అవకాశం ఉంది. ఈ పైలట్ ప్రాజెక్టు విశాఖలో విజయవంతంగా అమలు చేస్తున్నారు.

గుండెనొప్పి వచ్చిన వారికి తక్షణం థ్రాంబోలిసిస్‌కు సంబంధించిన ఇంజెక్షన్లు ఇవ్వాలి. దీని ఖరీదు సుమారు రూ.40వేలు వరకు ఉంటుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన వివిధ ఆస్పత్రుల్లో ఈ ఇంజెక్షన్ ఉచితంగా ఇచ్చి రోగి ప్రాణాలు కాపాడుతున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి విశాఖలో 14 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీ)ల్లో ఈ ప్రాజెక్టు అమలవుతోంది. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రుల్లో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా ఉండే వైద్య విధాన పరిషత్ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ)లో కూడా అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్‌గా ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్‌ను ప్రభుత్వం నియమించింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏయే ఆస్పత్రుల్లో...

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 14 ఆస్పత్రులను ఎంపిక చేశారు. విశాఖ జిల్లాలో ఏరియా ఆస్పత్రి (అగనంపూడి), భీమిలి, గోపాలపట్నం, పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, అనకాపల్లి జిల్లా ఆస్పత్రితో పాటు కె.కోటపాడు, యలమంచిలి, నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అల్లూరి జిల్లాలోని అరకు ఏరియా ఆస్పత్రి, పాడేరు జిల్లా ఆస్పత్రి, వి.మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

ఒక్కో ఆస్పత్రికి ప్రత్యేకంగా అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి ఆస్పత్రిలో ఐసీయూ, ఆక్సిజన్, వెంటిలేటర్ ఇతర పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో థ్రాంబోలిసిస్‌కు సంబంధించిన ఇంజెక్షన్లు రెండేసి అందుబాటులో ఉన్నాయి.

లబ్ధి ఇలా..

- గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన యు.గిరిధర్ (55) ఈనెల 7వ తేదీన ఆకస్మాతుగా గుండెనొప్పి వచ్చింది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు.
- రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన అనిమిరెడ్డి నాగరాజు (70)కు ఈనెల 15వ తేదీన గుండెనొప్పి రావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు.
- కూర్మన్నపాలెం ప్రాంతం శాతవాహననగర్‌కు చెందిన గున్నం రత్నం (78)కి ఈనెల 2వ తేదీన గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకొని వచ్చి ఇంజెక్షన్ ఇచ్చారు. దీంతో రత్నం ప్రాణాలను వైద్యులు కాపాడారు.

అత్యవసర సేవలు

గుండె నొప్పి వచ్చిన వెంటనే తొలుత ఈసీజీ తీయాల్సి ఉంటుంది. ఈ రిపోర్టును కార్డియాలజీ విభాగంలో విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మికి వాట్సప్‌ద్వారా పంపుతున్నారు. వారి సలహా, కార్డియాలజీ వైద్యుల సూచన మేరకు రోగికి సుమారు రూ.40 వేలు విలువ చేసే టెనెక్టెప్లాస్ ఇంజక్షన్ ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పటి వరకు నర్సీపట్నంలో రెండు, అగనంపూడిలో ఒక ఇంజెక్షన్ ఇచ్చారు. దీని వల్ల తక్కువ వ్యవధిలో ముగ్గురు ప్రాణాలను వైద్యులు కాపాడారు.

విజయవంతంగా..



స్టెమి ప్రాజెక్టు ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయవంతంగా అమలు జరుగుతోంది. అకస్మాత్తుగా గుండె జబ్బులు వస్తే సంబంధిత ఏరియాలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులను సంప్రదించాలి. వైద్యం అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. గుండె జబ్బులున్న వారికి స్టెమి ఓ బాసటగా నిలుస్తోంది.

–డాక్టర్ రమేష్ కిశోర్, ప్రాజెక్టు నోడల్ అధికారి

ప్రాణాలు కాపాడారు



నా వయస్సు 78ఏళ్లు. ఈనెల 2వ తేదీన గుండె నొప్పి వచ్చింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశా. అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. అక్కడ పరీక్షలు చేశారు. ఆ తర్వాత టెనెక్టెప్లాస్ ఇంజక్షన్ ఇచ్చారు. కొద్ది రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఇప్పుడు ఆరోగ్యం కుదుటపడింది.

–గున్నం రత్నం, శాతవాహన నగర్, కూర్మన్నపాలెం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు వేచలం విద్యార్థులు


వేచలం హైస్కూల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం నర్సింహమూర్తి తదితరులు

దేవరాపల్లి: వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదుగురు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. విశాఖ ఆంధ్రా యూనివర్శిటీ మెడికల్ గ్రౌండ్‌లో గత నెల 30న జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా సెలక్షన్ ట్రయల్స్‌లో వేచలం హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అంతర జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు అర్హత సాధించారు. ఈ నెల ఈ 21, 22, 23 తేదీలలో గుంటూరులో ఏఎన్‌యూలో జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు.

అండర్–14 విభాగంలో బి. చైతన్య లాంగ్ జంప్, ట్రయాథ్లెన్‌కు, వి. ప్రవల్లిక హై జంప్‌కు, అండర్–16 విభాగంలో వి. నారిబాబు హైజంప్‌కు, వి. హరిప్రసాద్ హెక్సాథ్లెన్ సహా ఆరు ఈవెంట్లకు, టి.రవి శంకర్ 5 కి.మీ రేస్ వాక్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్న విద్యార్థులతో పాటు పీడీ ఆర్.తమ్మునాయుడును స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం దేవుపల్లి నర్సింహమూర్తి, స్థానిక సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

జగనన్న కాలనీల్లో వినాయక చవితి

నక్కపల్లి : వినాయక చవితిని ఇళ్లల్లోను, ఆలయాల్లోనే కాకుండా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో కూడా జరుపుకోవడం విశేషం. పాయకరావుపేట మండలం పి.ఎల్.పురంలో 42 ఎకరాల్లో మెగాలే అవుట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పాయకరావుపేట పట్టణానికి చెందిన 1350 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. సుమారు 150 మందికి పైగా ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు జరుపుకొన్నారు. తాజాగా వినాయక చవితి పండగను ఈ మెగాలేఅవుట్ (జగనన్న కాలనీలో) అట్టహాసంగా జరుపుకొన్నారు. జగనన్నకాలనీలో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి గణేష్ విగ్రహాన్ని నెలకొల్పారు. ఇళ్లు నిర్మించుకున్నవారితో పాటు, పట్టాలు పొందినవారు, వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణపు పనులు చేసుకుంటున్న వారంతా సోమవారం జరిగిన చవితి వేడుకల్లో పాల్గొన్నారు.


మెగా లేఅవుట్‌లో వినాయక చవితి పూజల్లో పాల్గొన్న కాలనీ వాసులు


పి.ఎల్.పురం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో గణేష్ ప్రతిమను ఏర్పాటు చేస్తున్న కాలనీవాసులు

• శివ శివమూర్తివి గణనాథా...


తారువలో వినాయకుని సన్నిధిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు


పాయకరావుపేట మండలం నామవరంలో చవితి పూజలందుకున్న నాడీ గణపతి


నక్కపల్లి మండలంలో ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న భక్తులు

'చిత్రం' భళారే వినాయకం



తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ తోటకూర గింజలతో వినాయక చిత్రాన్ని తయారు చేశాడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ చిత్రాన్ని రూపొందించానని, దీనికి 3456 తోటకూర గింజలను వినియోగించినట్టు తెలిపాడు.

– మాకవరపాలెం:

ఒడ్డిమెట్ట వినాయకుడి ఆదాయం రూ.4 లక్షలు

నక్కపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని ఒడ్డిమెట్ట లక్ష్మీ గణపతికి రూ.4,08,475ల ఆదాయం లభించింది. సోమవారం వినాయక చవితి సందర్భంగా దర్శనం టికెట్లు, స్పెషల్ దర్శనం టికెట్లు, కేశఖండన, భక్తులు సమర్పించిన విరాళాలు, హుండీలు, కొబ్బరి ముక్కల వేలం ద్వారా ఈ ఆదాయం లభించిందని ఈవో వెంకటాద్రి తెలిపారు. మంగళవారం హుండీలను లెక్కించారు. గత ఏడాది కంటే రూ.15 వేలు అధికంగా ఆదాయం లభించిందన్నారు.

స్కూటీని ఢీకొన్న వ్యాన్

- ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

కశింకోట: తాళ్లపాలెం వద్ద మంగళవారం రాత్రి 8.30 ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరొకరు గాయపడ్డాడు. పోలీసులు అందించిన వివరాలు.. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న స్కూటీని వెనుక నుంచి పెద్ద వ్యాన్ ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వస్తున్న ఇదే మండలం తీడ గ్రామానికి చెందిన బుంగా ప్రదీప్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. పాట్ల సంతోష్ (22) తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, క్షతగాత్రుడు సంతోష్‌ను చికిత్స కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మునగపాక మండలం గణపర్తి గ్రామం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

కంటైనర్ లారీ ఢీకొట్టి ఒకరు మృతి

నక్కపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారిపై చినదొడ్డిగల్లు కూడలి వద్ద తుని వైపు పల్సర్ మోటారు సైకిల్‌పై వెళ్తున్న మాకవరపాలెం మండలం తాతయ్యపాలెం గ్రామానికి చెందిన బొడ్డు సతీష్(24)ను వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

తండ్రి మందలించాడని గడ్డి మందు తాగాడు


మృతి చెందిన నరేంద్ర

పాయకరావుపేట : అరట్లకోట గ్రామానికి చెందిన వేముల నరేంద్ర (18) గడ్డి మందు తాగి మృతి చెందాడని ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. నరేంద్ర తన స్నేహితుడుతో కలిసి ఈ నెల 13 న తిరుపతి వెళ్లాడు. తిరిగి 16 న ఇంటికి వచ్చాడు. తిరుపతిలో తలనీలాలు ఇవ్వకుండా, మొక్కు చెల్లించుకోకుండా రావడంతో తండ్రి పోలారావు మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన నరేంద్ర సోమవారం ఉదయం గడ్డి మందు తాగాడు. అతనిని తుని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. మృతుడి తండ్రి ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

కె.కోటపాడు : పిడుగుపాటుకు గురై కె.సంతపాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు కశిరెడ్డి నాగమయ్య(63) సోమవారం సాయంత్రం మృతిచెందాడు. సోమవారం సాయంత్రం వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. నాగమయ్య తన కళ్ళం వద్ద పాక వద్ద ఉండగా నాగమయ్య సమీపంలో పిడుగు పడడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై మృతుడి భార్య సోములమ్మ కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

- 15 మంది అరెస్ట్, 9 బైక్‌లు, కోళ్లు, నగదు స్వాధీనం

రావికమతం: పెదపాచిల గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందాలపై రావికమతం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు కథనం మేరకు పెదపాచిల గ్రామంలో పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. నిర్వాహకులు 15 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 9 బైక్‌లు, రెండు కోడి పుంజులు, రూ.4,860 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై....

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని నరేంద్రపురం గ్రామానికి చెందిన చందక వెంకట రమణ(45) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన వెంకట రమణ తెల్లవారు జాము సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

22న మెగా జాబ్‌మేళా

మాకవరపాలెం: ఈనెల 22న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి చాముండేశ్వరరావు మంగళవారం తెలిపారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వయసున్న, పది నుంచి పీజీ వరకు చదివిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 9494791935, 8309561123, 9014765287 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

- సోమన్నపాలెం వద్ద ఘటన
- ఆస్పత్రికి తరలించిన స్థానికులు


యలమంచిలి : ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలివి. యలమంచిలి పాత జాతీయ రహదారి సోమన్నపాలెం గ్రామం వద్ద మంగళవారం లక్కవరం గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న జల్లి రాంబాబు, యలమంచిలి నుంచి తుని వైపు వెళుతున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో రాంబిల్లి మండలం చినకలవలాపల్లి గ్రామానికి చెందిన రాంబాబుకు తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు 108లో తరలించారు. అయితే ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు మంగళవారం సాయంత్రం తెలిపారు.

సచివాలయాల వద్ద నోటరీ సేవలు

విధివిధానాలపై చర్చించిన అధికారులు

మహారాణిపేట: గ్రామ,వార్డు సచివాలయాల వద్ద నోటరీ సేవలు అమలుపై అధికారులు చర్చించారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, గ్రామ వార్డు సచివాలయ శాఖ సమన్వయంతో నోటరీ ప్రాక్టీషనర్లతో సమావేశం నిర్వహించారు. సచివాలయాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి రిజిస్ట్రార్ ప్రాక్టిషనర్లను వారానికి రెండు రోజుల పాటు సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉంచాలని వార్డు సచివాలయ సమన్వయ అధికారి ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. నోటరీ సర్వీసులకు సచివాలయాల స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తీసుకొనే చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, 84 మంది నోటరీ ప్రాక్టిషనర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మృతి


తెరపల్లి సంతోష్ కుమార్(36)

కశింకోట : చింతలపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తెరపల్లి సంతోష్‌కుమార్ (36) దుర్మరణం చెందారు. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపిన వివరాలివి. చింతలపాలెంకు చెందిన సంతోష్‌కుమార్ మార్నింగ్ వాక్‌లో భాగంగా చింతలపాలెం నుంచి గొబ్బూరు వైపు జాతీయ రహదారి వెంబడి నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం జరిపించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చురుకైన పాత్ర పోషించే సంతోష్‌కుమార్ అనకాపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఉన్నారు. అతనికి భార్య దీవెన, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతోష్‌కుమార్ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, చింతలపాలెం సర్పంచ్ కొట్టి రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ కూడా సంతోష్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు, అభిమానుల అశ్రు నయనాల నడుమ మంగళవారం సంతోష్‌కుమార్ అంత్యక్రియలు జరిగాయి.

క్లుప్తంగా

ప్రజారోగ్యానికి ప్రభుత్వాలు పెద్దపీట

అనకాపల్లిటౌన్: ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా ఆయుర్వేద వైద్యురాలు కె.లావణ్య మంగళవారం సాక్షికి తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా జిల్లాలోని కన్నూరుపాలెం, వేంపాడు, కొరుప్రోలు ఆయుర్వేద భవనాల మరమ్మతుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.3.50 లక్షలు చొప్పున ఒక్కో కేంద్రానికి నిధులు విడుదల చేసిందన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో రోగులకు యోగాతోపాటు, ఉచిత మందులు పంపిణీ చేస్తున్నామని, కొరుప్రోలు ఆయుర్వేద కేంద్రంలో పంచకర్మ మందులు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఖర్చుచేసేందుకు జన ఆరోగ్య మిత్ర కమిటీని ఏర్పాటు చేసి, గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీల పర్యవేక్షణలో ఆయుర్వేద భవన మరమ్మతుల నిమిత్తం ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి


తాతబాబు

కశింకోట: మండలంలోని చింతలపాలెం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం గ్రామ అధ్యక్షుడు భీముని తాతబాబు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వయస్సు 27 సంవత్సరాలు. పార్టీలో చురుకైన కార్యకర్త. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చింతలపాలెం వెళ్లి తాతాబాబు మృతదేహానికి నివాళులర్పించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మండల పార్టీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ కొట్టి రాము సంతాపం తెలిపారు.

5న దుర్గమాంబ ఉత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న బుల్లిబాబు

కశింకోట: స్థానిక గవరపేటలో ప్రసిద్ధి చెందిన దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాన్ని అక్టోబర్ 5న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఆలయ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు సమక్షంలో కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ ఈ నెల 21న అమ్మవారి ఉత్సవ చాటింపు వేసి, 28న అమ్మవారి పుట్టుక ఉత్సవాన్ని పెద్ద ఎత్తున జరపనున్నట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఛాంగురే బంగారురాజా	రాజా
మార్క్ ఆంటోని	సత్యనారాయణస్క్రీన్-1
ది నన్	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	షిర్డిసాయి
జవాన్	షిర్డిసాయి
జవాన్	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	శ్రీసత్య
ఖుషి	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 831 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,220	4,360
రెండో రకం	4,020	4,090
మూడోరకం	3,700	4,000

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 53 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వందనాలు నీకివే.. వర గణేశ

విఘ్న సంహారకా.. అని శరణు వేడగానే గజానన రూపంతో కళ్ల ముందు కదిలే దైవం గణేశుడు. సకల విఘ్నాలను తొలగించి, చల్లగ కాచే తండ్రి వినాయకుడు. ఆ ఆదిదేవుడికి వినాయక చవితి సందర్భంగా ఊరూవాడా, వీధి వీధినా చలువ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం, సాయంత్రం పూజలు, భజనలు, తీర్థ ప్రసాద వితరణలతో ప్రతి మండపం.. ఓ ఆధ్యాత్మిక మందిరమే అయింది.

- ఊరూ వాడా అంబరాన్నంటిన చవితి సంబరాలు
- చవితి మండపాల నిర్వహణలో ఉత్సాహంగా యువత
- నిమజ్జనోత్సవాలకు పోలీసుల పటిష్ట బందోబస్తు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయకచవితి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక పందిళ్లలో భక్తులు తమ తాహతు మేరకు వినాయక విగ్రహాలను కొలువుదీర్చారు. వివిధ రకాలైన పత్రులు, పిండివంటకాలను తయారుచేసి స్వామివారికి నైవైద్యంగా సమర్పించారు. విగ్రహాలను కొనుగోలు చేసిన ప్రాంతం నుంచి మండపం వరకూ గణపతిని మేళతాళాలతో ఊరేగించారు. పర్యావణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని 90 శాతం మంది మట్టి గణపతులనే ఏర్పాటు చేశారు.

- గృహాల్లో, వ్యాపార దుకాణాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను ప్రత్యేక పూజలు చేసి, స్థానిక శారదానదిలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి నిమజ్జనం చేశారు.
- స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎంపీ స్వగృహంలో వినాయకుని మందిరంలో ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో ఆచరించే ప్రతి ఒక్కరిపైనా స్వామి దీవెనలు ఉంటాయని అభిలషించారు.
- గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో సోమవారం బాలాలయంలో చవితి వేడుకలను ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. పూజల అనంతరం స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయక నవరాత్రులు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
- గవరపాలెం పెదరామస్వామి దేవాలయంలో వినాయక నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణపతికి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.
- మండలంలో కొండకొప్పాక శివారు సుబ్రహ్మణ్యం కాలనీలో జానకీరామ్ యూత్ ఆధ్వర్యంలో కాలనీ వాసి రామిరెడ్డి ఆర్థిక సాయంతో విగ్రహ ప్రతిష్ట చేశారు.
- స్థానిక శారదానదిలో వినాయక నవరాత్రులను పురస్కరించుకుని శారదా ఘట్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ దాడి మోహనరావు తెలిపారు. నదిలో దిగేందుకు భక్తుల్ని అనుమతించట్లేదన్నారు. నిమజ్జనోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.
- జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు నర్సింగరావుపేటలో ఏలేరు కాలువలో వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్లలో భాగంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు.

చింతామణి దత్తక్షేత్రంలో..

జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో సోమవారం నుంచి వినాయక నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వామి వారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు క్షీరాభిషేకం, ఏకవింశతి పత్రార్చన, మహాగణపతి హోమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మూర్తి మాట్లాడుతూ నవరాత్రులు స్వామి వారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం గోపూజ ఏశారు. విశాఖ జిల్లా కూర్మన్నపాలెం శ్రీకృష్ణ కళామందిర్ వారిచే భరతనాట్యంకూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కశింకోట: మండలంలో వినాయక నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీధులు, గ్రామాల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పారు. వీటిలో కొన్నిచోట్ల వినూత్నమైన విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. వాటి వద్ద నిర్వాహకులు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. కశింకోట గ్రామంలోని గవరపేట, మేదర వీధి, కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి, పెదబజారు, ఎస్సీ కాలనీ, రౌతు వీధి, పందిరి వీధి, సాలాది వీధి, కోమటి వీధి, గోవిందరావు కాలనీ, హౌసింగ్ కాలనీ, అఫీషియల్ కాలనీ, ఇందిరా కాలనీ, సత్తెమ్మ కాలనీ, పూసర్ల వీధి, అగ్రహారం, వేణుగోపాలస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పారు. వెదురుపర్తి, బయ్యవరం, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, బంగారయ్యపేట, జి. భీమవరం, అచ్చెర్ల, తీడ, చింతలపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఎఎస్ పేట, ఏనుగుతుని, సోమవరం, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, జోగారావుపేట గ్రామాల్లో కూడా గణేష్ విగ్రహాలను కొలువుదీర్చి, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కశింకోటలోని రౌతు వీధిలో బాల వినాయక సేవా సంఘం తరపున ఏనుగు కుంభస్థలంపై కొలువైనట్లున్న వినాయకుడు, బోయిల పేటలో మహారాజ గణేష్, కనకమహాలక్ష్మి వీధిలో శివలింగం చెంతన వినాయకుడు, బంగారయ్యపేటలో చేనేత నేస్తున్నట్లు వినూత్నంగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, ఆకట్టుకున్నారు.

- కశింకోటలోని అగ్రహారంలో బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంఘం ఆధ్వర్యంలో గత 32 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా వినాయక ప్రతిమను నెలకొల్పి ప్రత్యేక పూజలు జరిపారు. సంఘ శాశ్వత అధ్యక్షుడు వేదుల వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు అవసరాల కామేశ్వరి, ప్రతినిధులు మొక్కరాల కిషోర్‌కుమార్, గుళ్లపల్లి శ్రీను, వార్డు సభ్యుడు కందాల సూర్య జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


తమ స్వగృహంలోని వినాయక మందిరంలో గంధంతో గణేశుడిని అభిషేకిస్తున్న ఎంపీ సత్యవతి దంపతులు


గవరపాలెం పెద్దరామస్వామి దేవాలయంలో గణేశుడి పూజలో దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు


సుబ్రహ్మణ్యం కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని పూజిస్తున్న కాలనీ వాసులు


శారదానదిలో వినాయక నిమజ్జనానికి తరలివచ్చిన మహిళ


కశింకోటలోని రౌతు వీధిలో ఏనుగు కుంభ స్థలంపై కొలువైన వినాయకుడు


నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని పూజిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


శారదానది వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న పట్టణ సీఐ దాడి మోహనరావు


బోయిల వీధిలో మహారాజ వినాయకుడు


భరతనాట్యంతో గణేశుడిని అర్చిస్తున్న చిన్నారులు


కోట్నివీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి రాఘవ ఆధ్వర్యంలో వినాయకుడికి పూజలు


బంగారయ్యపేటలో చేనేత కార్మికునిగా గణేశుడు


గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో వినాయక మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం


కస్పావీధిలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పంచముఖ వినాయకుడు


కశింకోట కనకమహాలక్ష్మి వీధిలో శివలింగం చెంతన వినాయకుడు


గణపతికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు


కశింకోటలోని అగ్రహారం వీధిలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు

శారదా నదికి జల కళ


గవరపేట ప్రాంతంలో శారదానదిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు

కశింకోట: కశింకోట ప్రాంతంలో శారదానదికి జలకళ వచ్చింది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నది పొంగి మంగళవారం నీటి మట్టం పెరిగింది. ఇప్పటి వరకు సరైన వర్షాలు లేవు. దీంతో నదిలో నీరు తక్కువగా ఉండేది. తాజాగా అడపా దడపా ఎగువ ప్రాంతంలో వర్షాలు పడుతుండటంతో వరద నీరు చేరింది. దీంతో నిల్వ నీటి స్థానంలో బురదతో కూడిన నీరు వచ్చి చేరింది. కాస్త జోరుగా నది ప్రవహిస్తోంది. దీంతో నదిపై దోనెల ద్వారా నిత్యం తమ పొలాలకు, పశుశాలలకు రాకపోకలు సాగించేందుకు స్థానిక గవరపేట ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు. నది ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పరిమితంగా దోనెలపై నదిని దాటుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువకులు

అనకాపల్లిటౌన్: రక్తదానం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారి ప్రాణాలను కాపాడవచ్చని వాసవి క్లబ్ కార్యదర్శి బి.మంగరాజు అన్నారు. స్థానిక వైఎంవీఏ గ్రంధి సత్యనారాయణమూర్తి మెమోరియల్ హాల్లో కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. తరచుగా రక్తదానం చేసేవారి ఆరోగ్యం మరింత మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో 85మంది రక్తదానం చేయగా, విశాఖ లయన్స్ బ్లడ్ బ్యాంక్ వారికి వాటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.నాగరాజు, రక్తదాన శిబిరం ప్రోగ్రాం కన్వీనర్లు కేపీవీఎన్ రామలింగస్వామి(రాము), బి.శంకరరావు, కేవీ సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: కేరళలోని తిరువనంతపురం జిల్లా వెల్లాయంబళం జిమ్మీ జార్జ్ స్పోర్ట్స్' హాల్లో జరిగిన దక్షిణ భారత కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన స్థానిక క్రీడాకారులను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర కరాటే కోచ్ కాకర శివ ఆధ్వర్యంలో 12 మంది క్రీడాకారులు పాల్గొనగా, అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఏడుగురు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా మంచి నైపుణ్యం సాధించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే క్రీడల్ని ప్రోత్సహించేందుకు ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలను సమకూర్చిందన్నారు. విద్యార్థులు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. రాష్ట్ర జట్టులో వి.ఇంద్ర కుమార్ బంగారు పతకం గెలుపొందగా, ఎస్.దివ్యశ్రీ, కె.రేవతి, వై.మోహన్‌శ్రీను, పి.నిఖిల్, ఎ.సిరివర్షిణి, వి.భవానీలు కాంస్య పతకాలు సాధించారు.

23న నర్సీపట్నంలో దళిత ప్రతినిధుల గర్జన


దళిత ప్రతినిధుల గర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత సంఘ ప్రతినిధులు

అనకాపల్లిటౌన్: దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న నర్సీపట్నంలో దళిత ప్రతినిధుల గర్జన సభ నిర్వహించనున్నట్లు దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి దాసు, రేబాక మధుబాబు తెలిపారు. స్థానిక నెహ్రూచౌక్‌లో గర్జన సభ పోస్టర్‌ను దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మద్రా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం, రిజర్వేషన్ల సక్రమ అమలు, సబ్‌ప్లాన్, కాంపోనెంట్ నిధుల వినియోగం, దళిత ప్రాణ-మానాలకు రక్షణ, సంక్షేమ పథకాలలో రిజర్వేషన్ అమలు, అట్రాసిటీ చట్టంలో 41ఎ నోటీసుల రద్దు, సనాతన ధర్మంపై సమగ్ర అవగాహన వంటి అంశాలపై సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చిట్ల చలపతి, బంగారు వెంకటేశ్వరరావు, కట్టమూరి మంగరాజు, పందిరి దయాశ్‌రాజు, జామి శివఅప్పలరాజు, గంట్యాడ రమణబాబు, గొడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల పీహెచ్‌సీ తనిఖీ


తుమ్మపాల ఆస్పత్రి సమస్యలపై చర్చిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు, అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సమస్యలు, సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణ పరిశీలించి పరిశుభ్రం చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, మండల కో అప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, పెద్దాడ రాం శంకర్, మొల్లేటి శివాజీ, ఊడూరు సర్పంచ్ సెరిగిరి కృష్ణమోహన్, దాడి కుమార్, వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

8 మందికి ఐవోఎల్ ఆపరేషన్లు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఐవోఎల్ కంటి ఆపరేషన్లు జరిగాయి. ఆస్పత్రి ప్రతినిధి రవి రామ్ జవహర్ మాట్లాడుతూ సోమవారం 21 మంది రోగులకు కంటిపరీక్షలు చేయగా, 8 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశామన్నారు. క్లబ్ సీనియర్ సభ్యుడు, విశ్రాంత డీఈవో కె.వి.గౌరీపతి రోగులకు మందులు, ఆహారం అందించారు.

ఇంటింటికీ 'జగనన్న ఆరోగ్య సురక్ష'


వేల్పులవీధిలో రక్త పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం స్వప్న

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం ఇంటింటికీ వెళ్లి బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేశారు. 7వ వార్డు సచివాలయ ఏఎన్ఎం స్వప్న ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వినాయక నిమజ్జనాలు


గవరపేట ప్రాంతంలో శారదానదిలో వినాయక ప్రతిమలు నిమజ్జనం చేస్తున్న ప్రజలు

కశింకోట: స్థానిక శారదా నదిలో సోమవారం సాయంత్రం వినాయక ప్రతిమల నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. వినాయక చతుర్థి పురస్కరించుకుని ఇళ్లలో వినాయక ప్రతిమలను భక్తి శ్రద్ధలతో పూజించి సంప్రదాయంగా సాయంత్రం పూజా ద్రవ్యాలతోపాటు నదులు, కాలువలు, చెరువులు, బావుల్లోని నీటిలో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. దీనిలో భాగంగా స్థానిక గవరపేట, వడ్డి వీధి, గాడి వీధి ప్రాంతాల్లో శారదానదికి ఎక్కువ సంఖ్యలో పిల్లలు, మహిళలతో కలిసి ప్రజలు తాము పూజించిన వినాయక ప్రతిమలు, పూజా ద్రవ్యాలతో చేరుకుని నదిలో ఉత్సాహంగా నిమజ్జనం చేశారు. స్నానాలు ఆచరించారు. ఇక్కడి ఏలేరు కాలువ, బావుల్లో కూడా వినాయక నిమజ్జనాలు జరిగాయి.